క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న సిర్ర దేవేందర్

ఇచ్చోడ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నాలుగవ సీపీఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం పెట్టాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు రవి, వెంకటేశ్, రాజ్‌కుమార్, అశోక్, అన్నెల లక్ష్మణ్, రాజేశ్వర్, చిన్న లక్ష్మణ్, రాజేందర్ పాల్గొన్నారు.

వైద్యుల కేటాయింపుపై హర్షం



రిమ్స్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: మండల కేంద్రలోని సామాజిక ఆసుపత్రిలో ముగ్గురు పీజీ చేసిన వైద్యులు, ఐదుగురు ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్యులను కేటాయించడం పట్ల కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షాకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

7న గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న ఆరెల్లి మల్లేశ్

బజార్‌హత్నూర్: ఈనెల 7న ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో మాదిగల ఆత్మగౌరవ దండోరా జెండా ఎగరవేయాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు జెండా ఎగురవేయాలన్నారు. మండల అధ్యక్షులు అనిల్, అధికార ప్రతినిధి సాయి, నాయకులు భూమన్న, రాజు, గంగయ్య, రాకేశ్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని హెచ్‌ఈఓ పవార్ రవిందర్ అన్నారు. మండలంలోని రోల్‌మామడ గ్రామంలో మంగళవారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపట్టి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, ఆశ కార్యకర్త సుంగలిబాయి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి హాజరు

బోథ్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు నియమితులైన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ మండల నేతలు హాజరయ్యారు. ఎంపీ నగేశ్‌తో కలిసి వారు రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

అవగాహన కల్పించాలి

నేరడిగొండ: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. సమావేశంలో హెచ్‌ఈఓ పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత పాల్గొన్నారు.

ఒంటికి రెంటికి తిప్పలు

- పాఠశాలల్లో అసంపూర్తిగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు
- బిల్లుల చెల్లింపులో జాప్యం..
- నిలిచిన పనులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



తాంసి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు

తాంసి: మండలంలోని తాంసి, కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. దీంతో వారు ఒంటికి, రెంటికి ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఆయా పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరుకాగా, కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. అయితే బిల్లుల చెల్లింపు జాప్యంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. గతేడాది చేపట్టిన పనులు ప్రస్తుతం బడి పునఃప్రారంభమై పక్షం రోజులవుతున్నా నేటికి అలాగే ఉన్నాయి. ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలలో అరకొరగా ఉన్న మూత్రశాలలు ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

విద్యార్థులకు తప్పని అవస్థలు

తాంసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం గతేడాది కలెక్టర్ రూ.8 లక్షలు కేటాయించారు. కప్పర్ల పాఠశాలలో ఉపాధిహామీ నిధులు రూ.8 లక్షలు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. స్థానిక కాంట్రాక్టర్లు ఈ నిర్మాణ పనులు చేపట్టారు. బిల్లుల చెల్లింపు ఆలస్యం కావడంతో పనులు మధ్యలో నిలిపివేశారు. తాంసి పాఠశాలలో 182 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం విద్యార్థినులకు మాత్రమే మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఒక మూత్రశాల వినియోగించుకోవాల్సి వస్తోంది. విద్యార్థులు విరామ సమయంలో ఒంటికి బయటకు వెళ్లాల్సి వస్తోంది. కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 310 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి సంఖ్యకు సరిపడా మూత్రశాలలు సరిపోవడం లేదు. నూతన మూత్రశాలల గదుల నిర్మాణ పనులు నేటికి స్లాబ్ దశలోనే ఉన్నాయి. ప్రస్తుతం మరుగుదొడ్లు, మూత్రశాలలను బాలికలు మాత్రమే వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే పట్టించుకుని మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణ పనులు పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటున్నాం**
>
> తాంసి, జెడ్పీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీరాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కప్పర్లలో పనులు వేగవంతం చేస్తాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నాం.
>
> – శ్రీకాంత్, తాంసి, ఎంఈవో

ఫైలట్ ప్రజావాణితో సమస్యలు పరిష్కారం

- డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్

ఇంద్రవెల్లి: ఫైలట్ ప్రజావాణి ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ తెలిపారు. మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫైలట్ ప్రజావాణి, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు తమకు పింఛన్, రైతు భరోసా, పీఎం కిసాన్ నిధి, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ రావడం లేదంటూ దరఖాస్తులు చేశారు. సంబంధిత అధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలన్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్, విద్యుత్ శాఖ ఏఈ రాథోడ్ రోహిదాస్, అధికారులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: విన్నవిస్తున్న ప్రజలు

ప్రజావాణిలో 86 దరఖాస్తులు స్వీకరణ

నేరడిగొండ: మండల కేంద్రంలో మంగళవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసీల్దార్లు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 86 దరఖాస్తులు రాగా, ఇందులో 15 దరఖాస్తులను తక్షణమే పరిష్కరించారు. గిర్దావార్, విద్యుత్ శాఖ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా..

బోథ్: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాల ఆవరణలు మందుబాబులకు అడ్డాగా మారాయి. రాత్రివేళల్లో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. మద్యం తాగి బాటిళ్లను పగులగొడుతున్నారు. దీంతో విద్యార్థులకు ఉదయం పూట వచ్చే వాకర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ బాలికల పాఠశాల, జెడ్పీఎస్ఎస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల వద్ద రాత్రివేళ మందుబాబులు రెచ్చిపోతున్నారు. కొందరు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం. ఉదయం వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థులకు అక్కడ తాగిపడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. వీటితోపాటు సిగరెట్లు ఉన్నాయి. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరణ కోరగా, పాఠశాలల ఆవరణలో మద్యం సేవిస్తే కేసు నమోదుతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించామన్నారు.



ఎంపీపీఎస్ బాలికల పాఠశాల పక్కన బాటిళ్లు

విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలి

- మాజీమంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృషిపెట్టాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. పట్టణంలోని బీసీ గురుకుల, గిరిజన కొలాం ఆశ్రమ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడి మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు విద్యాసంస్థలను సందర్శించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నాయకులు పవన్, రంగినేని శ్రీనివాస్, సాయి, తదితరులు ఉన్నారు.



కొలాం ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న జోగు రామన్న

ఘనంగా డాక్టర్స్ డే



గిమ్మ పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న వైద్య బృందం



జైనథ్: డాక్టర్‌ను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

జైనథ్/సాత్నాల/నేరడిగొండ/ఆదిలాబాద్‌రూరల్/ఇచ్చోడ/బోథ్: జిల్లాల్లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీల్లో వైద్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జైనథ్ పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నైనతను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. ఇచ్చోడ పీహెచ్‌సీలో వైద్యాధికారులు కిరణ్‌కుమార్, మధురిమను సిబ్బంది సత్కరించారు. బోథ్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో, వేదం, నాగబూషణం పాఠశాల, బీఆర్ఎస్‌తోపాటు మాల సంక్షేమ సంఘం నాయకులు బోథ్ మండలంలో పలువురు వైద్యులు రవీంద్రప్రసాద్, నవీన్ రెడ్డి, మిథిలేష్, ఉపేందర్ జాదవ్, విశ్వనాథ్, రవీంద్రబాబు సన్మానించారు. భోరజ్ మండలం గిమ్మ పీహెచ్‌సీలో డాక్టర్ సుచలా, నేరడిగొండ పీహెచ్‌సీలో వైద్యాధికారి సద్దాం పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆదిలాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద అశోక్, లయన్స్ క్లబ్ కార్యదర్శి భవన్ దాస్ దుర్గే, హెచ్‌ఈఓ పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్ బాపూజీ, మండల ప్రత్యేకాధికారి పద్మభూషణ్ రాజు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈవో నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన శ్రీధర్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో మావల మండలం వాఘాపూర్ గ్రామానికి చెందిన, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ కలిశారు. మండలంలోని వాఘాపూర్ గ్రామంలో ఓవర్ సైజ్ విధానంతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లులు రాక లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి వారికి వెంటనే బిల్లులు వచ్చేలా చూడాలని కోరారు. పరిశీలించి వారికి త్వరలో బిల్లులు వచ్చేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు శ్రీధర్ తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది పనితీరు, గ్రామాల ప్రజల ఆరోగ్య పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. మాతా శిశురక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. వైద్యాధికారులు శ్రీకాంత్, పూజిత, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మనోహర్

ఫార్మాలో ప్రమాదంపై న్యాయవిచారణ చేపట్టాలి

ఆదిలాబాద్‌అర్బన్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట నారాయణ మాట్లాడుతూ ఈ ఘటనకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. మృతిచెందిన ఒక్కో కార్మిక కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ఇవ్వాలన్నారు. గాయాలైనవారికి రూ.25 లక్షలు ఇవ్వాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించాలన్నారు. తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నర్సింగ్, దేవిదాస్, నాయకులు అర్క శేషరావు, రాజు, తౌఫిక్, శంషీర్, అజీమ్, మహేందర్, రాకేశ్, అశోక్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ముసురుకుంది..

జిల్లాలో గత రెండురోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మోస్తారు స్థాయిలో కురవగా మంగళవారం ముసురుకుంది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాల నేపథ్యంలో పలువురు గొడుగులు, రెయిన్‌కోట్లు కొనుగోలు చేయడంతో వాటి గిరాకీ పెరిగింది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జె.అరుణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 4లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ మెమోలతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఫొటోలు అందజేయాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

బోథ్: లాసెట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మండల కేంద్రానికి చెందిన ఎల్కుచి రుతికను టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మంగళవారం సన్మానించారు. సభ్యులు సదానందం, కత్తూరి హన్మండ్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఇంద్రవెల్లి: ఏమాయికుంట పంచాయతీ పరిధి గలియబాయితండాలో గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చందా రూపంలో నగదు జమ చేసి వీటిని ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్ తెలిపారు. కార్యదర్శి రమేశ్, గ్రామస్తులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

బోథ్: సొనాల పంచాయతీ మాజీ సర్పంచ్ కసిరె చిన్నయ్య మృతిచెందారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. బుధవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని సవర్గాం గ్రామానికి చెందిన ఇందర్ నాయక్ కుమారుడు సందీప్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, నాయకులు శేఖర్, యువ నాయకులు ఎండీ సద్దాం, మౌలానా ఉన్నారు.

బ్యాగులు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: అయ్యప్ప ఫౌండేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాటిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం బ్యాగులు, షూలు, నోట్‌బుక్‌లు, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. అధ్యక్షుడు వెంకటేశ్, హెచ్‌ఎంలు లచ్చిరాం, నారాయణ, రాహుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నిర్మల్ వారియర్స్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు 'మెరుగైన ప్రపంచాన్ని నిర్మించడం నాతోనే ప్రారంభమవుతుంది'అనే అంశంపై వ్యాస రచన పోటీలు, 'బాలికల భద్రత–సమాజ బాధ్యత' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ మండల అధ్యక్షుల సమావేశం

నేరడిగొండ: నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షుల సమావేశం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావ్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని గిన్నెర ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు, పోలీస్ కానిస్టేబుల్ దుర్వ సంతోష్ మంగళవారం నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు నానిగౌడ్, గ్రామపెద్దలు మెస్రం భీంరావ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఇంద్రవెల్లి విద్యుత్ శాఖ ఏఈ రాథోడ్ రోహిదాస్ అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలతోపాటు తీగలకు దగ్గరగా వెళ్లొద్దన్నారు. తడి చేతులతో ఎలక్ట్రికల్ స్విచ్‌లు, ప్లగ్‌లు తాకవద్దన్నారు. విద్యుత్ స్తంభాలు లేదా వైర్‌ల నుంచి విద్యుత్ షాక్, స్పార్క్ కనిపిస్తే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం

ఇచ్చోడ: అడవుల పెంపకం కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని టైగర్ జోన్ అటవీ అధికారి నాగవత్‌స్వామి కోరారు. వన మహోత్సవంలో భాగంగా కవ్వాల్ టైగర్‌జోన్ అటవీ పరిధి తలమద్రి, సిరిచెల్మ, బావోజీపేట్ బీట్‌లలో దాదాపు 120 ఎకరాల్లో మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడారు. టైగర్‌జోన్ అటవీ పరిధిలోని మైదాన ప్రాంతాలు గుర్తించి మొక్కలు నాటడానికి గుంతలు తవ్వినట్లు పేర్కొన్నారు.

గురువులతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు

ఆదిలాబాద్‌టౌన్: గురువులతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కేంద్రంలోని కోలిపుర ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.మురళి అన్నారు. కోలిపుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జయకు మంగళవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జయ వేణు దంపతులను శాలువతో సన్మానించారు. ఉపాధ్యాయులు రవీంద్ర, సంజీవ్‌రావు, బి.శేఖర్, భీంరావు, పాండురంగ, రుబీన, మాధవి, శాంత పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయండి



వార్షికోత్సవ సంబరాల్లో బీమా సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త ఒక రోజు సమ్మె జయప్రదం చేయాలని జీవిత బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నసీరుద్దీన్ కోరారు. 75వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. సంస్థ అభివృద్ధితోపాటు పాలసీదారుల ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతున్నామన్నారు. ఇందులో సంఘం కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

తలమడుగు: మండలంలో యూరియా కొరత లేదని, రైతులెవరు ఆందోళన చెందవద్దని ఏవో ప్రమోద్‌రెడ్డి సూచించారు. మండలంలోని పల్లి(బీ), ఝరి, సుంకిడి, తలమడుగు, కుచలాపూర్, బరంపూర్ ఆయా గ్రామాల్లోని ప్రాథమిక సహకార సంఘం ద్వారా అందిస్తున్న ఎరువుల గోదాములను మంగళవారం తనిఖీ చేశారు. అందుబాటులో 2,220 యూరియా బ్యాగులు ఉన్నాయన్నారు. ఝరి గోదాంలో ఎరువులను రైతులకు అందజేశారు. సీఈవోలు రాజు, శ్రీనివాస్, ఏఈవోలు రమేశ్, స్ఫూర్తి తదితర ఉన్నారు.

అల్లరిమూకల ఆగడాలు అరికట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో అల్లరిమూకల ఆగడాలు అరికట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. ఈ మేరకు పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని కోరారు. సెలవు రోజుల్లో, పాఠశాల తరగతులు ముగిసిన తర్వాత అల్లరిమూకలు చేరి మద్యం సేవించడం, పేకాట ఆడడం వంటివి చేస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎస్పీ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు. జిల్లా అధ్యక్షుడు కె.కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, కోశాధికారి కె.శ్రీనివాస్ తదితరులున్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన రూపేష్ రెడ్డి

కైలాస్‌నగర్: యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కలిసి శాలువతో సత్కరించారు. కష్టకాలంలో వెన్నంటే ఉండి పార్టీ జెండా మోసి కష్టపడి పనిచేసిన వారికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని కోరారు. మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు విపిన్ టాక్రే, చవాన్ స్వప్నల్ తదితరులు ఉన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న రూపేష్‌రెడ్డి